GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

సంపుటి : 6 | సంచిక : 327 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం: 20-07-2024 | పేజీలు : 3

## విద్యా వ్యవస్థలో...

# సరికొత్త విధానం



- 3వ తరగతి వరకు అంగన్ వాడీల్లోనే ప్లేస్కూల్ తరహా బోధన
- 4 నుంచి సెమీ రెసిడెన్షియల్స్.. విద్యార్థులకు రవాణా సదుపాయం
- విద్యావేత్తలతో చర్చించి ప్రణాళికలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



**టీ మీడియా,జులై 19,హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను, విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా సరికొత్త విధానంతో ముందుకు వెళ్లాలని విద్యా శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆదేశించారు. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ ముఖ్య కారదర్శి బుర్రా వెంకటేశం గారు, ఇతర అధికారులకు సీఎం సూచించారు. ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ కు సమాంతరంగా అన్ని చోట్లా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారితో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ పై విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం ఈ మేరకు సూచనలు చేశారు.

### అంగన్ వాడీలకు సింగిల్ టీచర్

చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లే స్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్ వాడీ కేంద్రాలలోనే విద్యాబోధన చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంగన్ వాడీలలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా విద్యా బోధన కోసం ప్రత్యేకంగా ఒక టీచర్ నియమించేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

### రెసిడెన్షియల్స్ కు రవాణా సదుపాయం

3వ తరగతి వరకు అంగన్ వాడీ ప్లే స్కూల్ లో బోధన తర్వాత విద్యార్థులు 4వతరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుకునేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కు వెళ్లివచ్చేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని సీఎం సూచించారు.

### విద్యావేత్తలతో చర్చించాక పైలట్ ప్రాజెక్టు

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ప్లే స్కూల్, సెమీ రెసిడెన్షియల్ విధానాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయడానికంటే ముందే విద్యా వేత్తల అభిప్రాయాలు తీసుకోవాలని విద్యా శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యావేత్తల సూచనలను బట్టి ముందుగా ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టేలా ప్రణాళికలు ఉండాలని సీఎం చెప్పారు.

### సీఎస్ఆర్ ఫండ్స్ తోనూ..

పాఠశాల్లో వసతులు, సౌకర్యాల పెంపు కోసం ప్రభుత్వ నిధులతోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ( సీఎస్ఆర్) ఫండ్స్ పైనా దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు. వీటితోపాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి .. టీఆర్ఎస్ ను జాతీయ పార్టీ అని చెప్పి బీఆర్ఎస్ గా పేరు మార్చి పక్క రాష్ట్రాలతో గొడవలు పెట్టుకున్నారన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కేంద్రం నుంచి సరైన నిధులు తేలేకపోయారని ఎద్దేవా చేశారు. జిల్లా మంత్రిగా జిల్లా ఉన్నతాధికారుల సమీక్ష సమావేశానికి నేడు కరీంనగర్ కు వచ్చిన ఆయన ముందుగా మీడియాతో మాట్లాడుతూ, ధనిక తెలంగాణను అప్పుల పాలు చేశారని, ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో అరాచకాలను కేసీఆర్ పాల్పడ్డారని దుయ్యబట్టారు.ఫోన్ ట్యాపింగ్ తో పాటు ఇరిగేషన్, విద్యుత్ సంస్థల్లో కేసీఆర్ అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులకు వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే పేకమేడ లాగా కూలిపోతుందన్నారు.రైతుబంధు నిధులను రుణమాఫీ కోసం వాడామని బీఆర్ఎస్ నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రైతు భరోసా రైతులకు ఇచ్చి తీరుతామని చెప్పారు. ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కేసీఆర్ లాగా రుణమాఫీకి పదేళ్ల సమయం తీసుకోలేదని అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రుణమాఫీ చేశామని తెలిపారు. వాస్తవాలను బిఆర్ఎస్ నేతలు ఇంకా ఒప్పుకోవడం లేదని, కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకుల మాదిరి గొప్పలకు వెళ్లడం లేదని ఉద్ఘాటించారు.

## కెసిఆర్ పదేళ్ల పాలనలో జరిగింది

# ఆర్థిక విధ్వంసమే

- నిరంతర దోపిడి చేసిన ఘనుడు కెసిఆర్
- మంత్రి పొంగలేటి శ్రీనివాసరెడ్డి

**టీ మీడియా, జులై 19, కరీంనగర్ :**

కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ధ్వజమెత్తారు

# మైక్రోసాఫ్ట్‌తో సంప్రదించాం..

## సర్వర్ల అంతరాయంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**టీ మీడియా, జులై 19, ఢిల్లీ:**

ప్రముఖ టెక్ దిగ్గం మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్ంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. విమానాలు మొదలు బ్యాంక్‌లు, స్టాక్ మార్కెట్స్, సూపర్ మార్కెట్స్ వరకు పలు రంగాలకు అంతరాయం కలిగింది. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది విండోస్ యూజర్లు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ అనే ఎర్రర్ సమస్యను ఎదుర్కొంటున్నారు. మైక్రోసాఫ్ట్ సర్వర్ అంతరాయం కారణంగా భారత్‌లోనూ పలు రంగాలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో ఏర్పడ్డ అంతరాయాన్ని పరిష్కరించేందుకు భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మైక్రోసాఫ్ట్‌తో సంప్రదింపులు జరుపుతోంది. ఈ అంతరాయానికి కారణం ఏంటో గుర్తించారు. సమస్య పరిష్కారానికి కూడా ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి తెలిపారు. అలాగే సమస్య పరిష్కారానికి కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ మైక్రోసాఫ్ట్‌కు పలు కీలక సూచనలు చేసినట్లు మంత్రి ఎక్స్ వేదికగా ప్రకటించారు.అలాగే ఈ అంతరాయం నేషనల్ ఇన్ఫార్మాటిక్స్ సెంటర్‌పై ఎలాంటి ప్రభావం చూపలేదని మంత్రి పేర్కొన్నారు. ఎన్ఐసీ అనేది ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ నెట్‌వర్క్, ఇది కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాలకు సేవలను అందించే కమ్యూనికేషన్ నెట్‌వర్క్. దీనిపై ఎలాంటి ప్రభావం పడలేదు. దీంతో భారత్‌లో ప్రభుత్వ కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేనట్లు తెలుస్తోంది.




### కేంద్ర మంత్రి చేసిన ట్వీట్..

భారత దేశంలో విస్తారా, ఇండిగో, స్పైస్‌జెట్, అకాసా వంటి విమానాయన సంస్థలపై ఈ అంతరాయం తీవ్ర ప్రభావం చూపుతోంది. చెక్ ఇన్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. విమానయాన సంస్థలు ప్రస్తుతం ప్రయాణికులకు మాన్యువల్‌గానే టికెట్లను జారీ చేస్తున్నాయి. కాగా అంతరాయంపై మైక్రోసాఫ్ట్ సైతం అధికారికంగా ప్రకటించింది. నిరంతరం సేవలను మెరుగుపరుస్తున్నామని మైక్రోసాఫ్ట్ తెలిపింది. సమస్యను సరిదిద్దేందుకు అనేక బృందాలు పని చేస్తున్నాయని, ఇందుకు గల కారణాలను తెలుసుకుంటున్నామని తెలిపింది.

# కాంగ్రెస్ సంబరాలు.. కమలం వ్యూహాలు..

- లోకల్ బాడీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీల పావులు




**టీ మీడియా, జులై 19, హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై పోరుకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతోంది. వందరోజుల హామీలు 8 నెలలైన అమలు చేయకపోగా.. డిక్లరేషన్ల పేరుతో ఆయా వర్గాలను వంచించారంటూ టీబీజేపీ నిరసన సభలకు సన్నాహకాలు చేస్తోంది. ఓ వైపు అధికార కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మెజారిటీ అమలు చేస్తున్నామని.. ఒక్కో హామీ నెరవేరుతోందంటూ సంబరాలు చేసేందుకు రెడీ అవుతోంది. దానికి పోటాపోటీగా విపక్ష బీజేపీ అటకెక్కిన మరిన్ని హామీలంటూ ఆందోళనలకు శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలో మరికొద్ది రోజుల్లో రానున్న లోకల్ బాడీ ఎన్నికలే లక్ష్యంగా అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. అందుకు అధికార హస్తం పార్టీ సైతం హామీలు అమలు చేస్తున్నామంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు ఉత్సావాల పేరిట కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. అయితే ప్రతిపక్ష పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన కమలం పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఇప్పటికే నిరుద్యోగుల సమస్యలపై బీజేవైఎం రోడ్లెక్కి ధర్నాలు, పార్టీ కార్యలయాల ముట్టడిలు చేపట్టగా.. మహిళలకు రక్షణ లేదంటూ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఇటీవల ధర్నాచౌక్?లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాడానికి ఆయా జిల్లా కేంద్రాల్లో డిక్లరేషన్ల పేరుతో భారీ సభలు పెట్టి హామీలు ఇచ్చి అరకొరగా అమలుతో ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ ఎక్కడైతే డిక్లరేషన్లు పెట్టిందో అక్కడే అదే వర్గాల ప్రజలతో నిరసన సభలకు కాషాయ దండు స్కెచ్ వేసింది. కాంగ్రెస్ చేస్తోన్న మోసాలను తాము అక్కడే డిక్లేర్ చేస్తామంటూ కమలం నేతలు చెబుతున్నారు. నిరుద్యోగులకు రాహుల్ గాంధీ, రేవంత్ ఎక్కడైతే సీటీ సెంట్రల్ లైబ్రరీ దగ్గర జాబ్ క్యాలెండర్ హామీ ఇచ్చారో అక్కడి నుంచే పోరాటానికి బీజేపీ రెడీ అయింది. ఈ నెల 20న చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నా చేయనున్నారు. వరంగల్?లో కాంగ్రెస్ రైతు డిక్లేరేషన్ ఇచ్చిన చోటే రైతులతో అతిపెద్ద నిరసన సభ పెట్టి హస్తం పార్టీ మోసాన్ని డిక్లేర్ చేస్తామని బీజేపీ నేతలు చెప్పారు. చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, సరూర్ నగర్?లో యూత్ డిక్లరేషన్, కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్, హైదరాబాద్?లో మైనార్టీ డిక్లరేషన్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఆయా ప్రాంతాల్లోనే హామీలు అమలు వైఫల్యాలను ఎండగట్టాలని.. భారీ నిరసన సభలతో రేవంత్ సర్కారు మోసాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ అంటోంది కమలం పార్టీ. మొత్తంగా రాష్ట్రంలో అధికార విపక్షాల మధ్య మరో ఆసక్తికర పోరు నెలకొంది.

## ఉప ముఖ్యమంత్రి భట్టితో అభ్యర్థుల చర్చలు సఫలం

# గ్రూప్ 3 పరీక్షలకు కొత్త తేది

మిగతా 3లో..

## ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా చూడండి

# వరదలపై చంద్రబాబు సమీక్ష

మిగతా 3లో..

## ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై

# విస్తృతంగా ప్రచారం చేయాలి

170 కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటు

మిగతా 3లో..

# ఉదయనిధి తమిళనాడు డిప్యూటీ సీఎం కాబోతున్నారా

- సీఎం ఎంకే స్టాలిన్ ప్లాన్ అదేనా?

**టీ మీడియా, జులై 19, చెన్నై:**

తమిళనాడు రాజకీయాల్లో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం ఏదైనా ఉంది అంటే అది ఒక్క కరుణానిధి కుటుంబం మాత్రమే. గతంలోకరుణానిధితమిళనాడుముఖ్యమంత్రిగా ఉండగానే చిన్న కుమారుడు ఎంకె స్టాలిన్ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆ తర్వాత స్టాలిన్ సీఎం అయ్యాక ఆయన కుమారుడు, నటుడు ఉదయనిధి స్టాలిన్ కూడా అదే తరహాలో పార్టీలో కీలకంగా మారారు. ఒకప్పుడు స్టాలిన్ ఏ ఫార్ములాతో రాజకీయాల్లో సక్సెస్ అయ్యారో.. ఇపుడు ఉదయనిధి స్టాలిన్ కూడా తండ్రినే ఫాలో అవుతున్నారు. అయితే ఇదంతా సీఎం స్టాలిన్ వ్యూహంగా చెబుతున్నారు. ఇంతకీ ఏంటా ఫార్ములా.. ఏంటా వ్యూహం..?తమిళనాడులో దివంగత నేత ఎం కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అనంతరం వారసుడు ఎవరు అన్నదీ పెద్ద ఎత్తున చర్చ నడిచింది. చర్చ అనడం కన్నా అదో పెద్ద వివాదం అని చెప్పొచ్చు..! అప్పటికే డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న స్టాలిన్, తన వారసుడు అంటూ కరుణానిధి స్వయంగా ప్రకటించారు. పెద్ద కుమారుడైన అలగిరి కరుణానిధి వారసత్వం కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే వారసుడిగా తన అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వ్యూహాత్మకంగా 2009 లోక్‌సభ ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎంగా




స్టాలిన్‌ను ఎంపిక చేశారు.ఆ సమయంలో కరుణానిధి ఆరోగ్యం కూడా పూర్తిగా సహకరించకపోవడం అటు పార్టీ ఇటు ప్రభుత్వం రెండు విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటాడన్న వ్యూహంతో ఆ రోజు కరుణానిధి ఆ నిర్ణయం తీసుకున్నారు. కరుణానిధి మరణానంతరం స్టాలిన్‌కు పార్టీ పగ్గాలు చేజిక్కించుకునేందుకు సీఎం అయ్యేందుకు ఆ రోజు కరుణానిధి నిర్ణయం ఎంతగానో దోహదపడింది. ప్రస్తుతం స్టాలిన్ కూడా అదే ఆలోచనతో తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు వారసత్వం అందాలన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఉదయనిధికి మంత్రివర్గంలో చోటు కల్పించిన స్టాలిన్, ఏకంగా డిప్యూటీ సీఎం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న స్టాలిన్ ఆరోగ్యపరంగా కూడా చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించాలంటే మంత్రిగా కంటే ఉపముఖ్యమంత్రిగా ఉండడం మంచిదన్న ఆలోచనతో స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.అలాగే 2026 లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కూడా డీఎంకేకు ప్రతిష్టాత్మకం రానున్నాయి.

తమిళనాడులో డీఎంకే ఏఐడీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండగా వచ్చే ఎన్నికల్లో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ కూడా బరిలో ఉండబోతోంది. దాంతో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే స్టాలిన్ తోపాటు తన అనుకున్న ముఖ్యమైన వారు పార్టీ బాధ్యతలను షేర్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసమే వీలైనంత త్వరగా డిప్యూటీ సీఎం చేయడం, ఇటు పార్టీకి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు సులువుగా ఉంటుందని స్టాలిన్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.మరోవైపు గతంలో తండ్రి కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే డిప్యూటీ సీఎం అయ్యాక పార్టీలో స్టాలిన్ మంచి పట్టు సాధించగలిగారు. ఇప్పుడు తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు కూడా అదే ఫార్ములా ఉపయోగపడుతుందని గట్టిగా భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయం అధికారికంగా ప్రకటన రానప్పటికీ డీఎంకేలో కీలక నేతల ద్వారా అందిన సమాచారం మేరకు వీలైనంత త్వరగా స్టాలిన్ తన నిర్ణయాన్ని అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**టీ మీడియా,జులై19,గోదావరిఖని ప్రతినిధి:**




రామగుండం కార్పొరేషన్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆహార పదార్థాలు బయట పడవేయడం వల్ల కుక్కలు పందులు దోమలు ఈగలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించడానికి ఆస్కారం ఉందన్నారు. ఇంటి ఆవరణతోపాటు పరిసరాల్లో నీళ్లు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుని సంప్రదించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా కాలువల్లో పూడిక తొలగించి నీళ్లు తాపీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. డివిజన్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగిస్తుండడంతో పాటు బ్లీచింగ్, స్ప్రేయింగ్ ప్యాకింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మురుగునీటి గుంతలు కుంటల్లో ఆయిల్ బాల్స్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మూతలు లేని నీటి కుండీలను గమనిస్తే నగరపాలక సంస్థ లేదా హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్ 9603666444 తెలుపాలని కోరారు.

# ఆదాయ పన్ను రిఫండ్ కు అక్రమ మార్గాలొద్దు

- ఐటీ అదనపు కమిషనర్ సుమిత పరమట ఐఆర్ఎస్

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**

ఆదాయ పన్ను రిఫండ్ కు అక్రమ మార్గాలను అనుసరించొద్దని, సక్రమంగా పన్ను చెల్లించి దేశాభివృ ద్ధికి సహకరించాలని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ సుమిత పరిమట అన్నారు. శుక్ర వారం ఐడిఓసి వనపర్తి కార్యాలయంలో ఉద్యోగులకు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు అంశం పై ఏర్పాటు చేసిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆమె జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ ఆదాయ పన్నులో మినహాయింపులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఉద్యోగులకు అవకాశం కల్పించినా సద్వినియోగం చేసుకోవటం లేదన్నారు. చాలా మంది 500 ఉద్యోగులు పన్ను మినహాయింపు పొందేందుకు రిటర్నుల్లో తప్పుడు సమాచారం నమోదు చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 20 శాతం, 30 శాతం రిఫండ్ తీసుకుంటుంటే, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మాత్రం చాలామంది 90




నుంచి 100 శాతం రిఫండ్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ రేంజ్-5 పరిధిలో తప్పుడు వివరాలు సమర్పించిన రిటర్నులు 14వేలు గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 10,635 ఉన్నాయని తెలిపారు రిపండ్ ఇప్పించి 5, 10 శాతం కమీషన్లు పొందేందుకు ఐటీ ప్రాక్టీషనర్లు తప్పుడు పత్రాలు సమర్పిస్తున్నారని, ఇలాంటివి పట్టుబడితే ఉద్యోగులే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఉద్యోగులకు వచ్చే మూల వేతనం వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని, పలు వురు తమ వేతనాలను తక్కువ వేసి రిటర్న్) ఫైల్ చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తప్ప వని పేర్కొన్నారు. బ్యాంకులు, రిజిస్ట్రేషన్ శాఖలో క్రయవిక్రయాల లావాదేవీలు, ఎలక్ట్రికల్, గృహోపక రణాలు, వాహనాల కోనుగోళ్లు, బీమా ప్రీమియం చెల్లింపులు తదితరాల వివరాలన్నీ ఎప్పటిక ప్పుడు తమకు అందుతూనే ఉంటాయని చెప్పారు. వారంతా తమ ఆదాయ పన్ను వివ రాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, లేక పోతే అక్రమంగా రిఫండ్ చేసిన సొమ్ముతో పాటు 1.30 వరకు వడ్డీ, 200 శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన పత్రాల్లో తప్పులు ఉంటే సవరించి మళ్లీ సమర్పించాలని సూచిం చారు. ఇందుకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తప్పుడు వివరాలు సమర్పించిన చాలా మంది ఉద్యోగులను గుర్తించి నోటీసులు, ఎస్ఎంఎస్ పంపించామని చెప్పారు. ఏటా ఆదాయ పన్ను వివరాలను జులై 31వ తేదీ వరకు సమర్పించాలన్నారు. ఐటీ ప్రాక్టీ షనర్స్ నమ్మి మోసపోవద్దని, సందేహాలు ఉంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ప్రభు త్వానికి సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ వర్క్ షాప్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఆదాయ పన్ను శాఖ జిల్లా అధికారి మంగళవారపు మనోజ్ కుమార్, జిల్లా అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు సిసిఆర్‌సి పత్రాలను తీసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి

**టీ మీడియా, జూలై 19, మహానంది:**

పొలాలు కౌలుకు తీసుకున్న ప్రతి రైతు సి సి ఆర్ సి పత్రాలను తీసుకోవాలని బి. నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో కౌలు రైతుల అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కౌలు రైతు బ్యాంకు నుండి రుణము పొందుటకు, పంట నష్టపరిహారం పొందుటకు, పంటల బీమా కొరకు, కనీస మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం వారు చేసే పంట కొనుగోళ్లకు ఈ పత్రం ఉపయోగ పడుతుందన్నారు.భూయజమాని సాగుదారు హక్కు పత్రం పైన సంతకం పెట్టడం వలన, అతని భూహక్కులకు ఎటువంటి భంగం కలగదని, కౌలు తీసుకున్న రైతుకు పంటపైన మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమిపైన ఎటువంటి హక్కు ఉండదని అన్నారు. కౌలు కార్డు



ఆధారంగా, కౌలు రైతు పేరు మీదనే పంట నమోదు చేస్తామని, ఈ పంట సాగుదారు హక్కు పత్రము కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు.దరఖాస్తు చేసుకొనుటకు మీ గ్రామ రెవెన్యూ అధికారిని, గ్రామ వ్యవసాయ అధికారిని వెంటనే కలవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో సంజీవ రెడ్డి, విఎ ఎ విష్ణు వర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## ఐఐటి సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**

గురుకుల పాఠశాలలో చదువుకొని తాటిపాములకు చెందినవిద్యార్థి ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కి పట్టణంలో ఐఐటి (సివిల్ ఇంజినీరింగ్)లో సీటు సాధించిన కె.గోపాల్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఘనంగా సన్మానించి ప్రోత్సాహకంగా 3000/- రూపాయలు అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి గోపాల్ మాట్లాడుతూ కె.సి.ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకులాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడం వల్ల నేను సీటు సాధించినానని అందుకు కె.సి.ఆర్ కి ధన్యవాదాలు తెలియజేశారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు మన ప్రాంతానికి పేరు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల.అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నందిమల్ల.సుబ్బు,అరుణ్ యాదవ్,చిట్యాల.రాము, యుగంధర్ రెడ్డి, రామస్వామి,తదితరులు పాల్గొన్నారు.



## వైద్య పరీక్షలకు విశేష స్పందన

- స్థానిక ప్రజలకు ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ

**టీ మీడియా, జులై19,గోదావరిఖని ప్రతినిధి:**

గోదావరిఖని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని పట్టణంలోని నిర్వహించారు. 33 వ డివిజన్ కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్ నెస్ సెంటర్ సహకారంతో సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు సరళ స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా నగరపాలక పరిధిలోని పరుశురాం నగర్ నగర్ లో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ తిరుపతి, ఏఎన్ఎం రాధ, ఆశ వర్కర్ రాజేశ్వరి, అంగన్ వాడీ టీచర్లు, ఆర్పీలు,సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఐసి ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

- లియాఫీ ,జోనల్ లీడర్స్, డివిషనల్ లీడర్స్ , బ్రాంచ్ లీడర్స్

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ ప్రశాంత్ (ఏజెంట్ కోడ్ నెం 4439680 డివో గోవింద్ నాయక్,) గురువారం ప్రమాదవశాత్తు మృతి చెందాడంతో విషయం తెలుసుకున్న ఏజెంట్ మిత్రులు గ్రామములో అంత్యక్రియలకు వారి కుటుంబ సభ్యులకు 25000/- రూపాయలు లియాఫీ నుంచి నగదు రూపకంగా ఇవ్వడం జరిగింది .ప్రమాదాన్ని గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో లియాఫీ , జోనల్ లీడర్స్, డివిషనల్ లీడర్స్ , బ్రాంచ్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మోసానికి పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీ

- గట్టు యాదవ్, వాకిటి.శ్రీధర్

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**



కాంగ్రెస్ ప్రభుత్వంది సగం రుణమాఫీతో ఆర్భాటపు సంబరాలు. మోసానికి పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీ. రైతు బంధు నిధులు ఋణ మాఫీకి మళ్లింపు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి రైతు భరోసా ఎగ్గొట్టి కొంతమంది రైతులకు 6000/- వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేయడం రైతులను మోసం చేయడమే అవుతుందని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్ దుయ్యబట్టారు.రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఋణ మాఫీపై రైతాంగాన్ని మభ్యపెడుతుందని అన్నారు.6వేల కోట్లతో ఋణ మాఫీ అవుతుందా అని ప్రశ్నించారు.యాసంగి రైతుబంధులోనే రైతులకు రెండు వేల కోట్లు ఎగ్గొట్టి వానాకాలం రైతుబంధు గురించి పట్టించుకోవడం లేదని అన్నారు.రైతులకు ఎకరాకు 7500/- చొప్పున 10వేల కోట్లు ఎగ్గొట్టారని అన్నారు.కోటి 73లక్షల మహిళలకు 2500/- చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడింది.కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబందుకు కూడా ఈ ప్రభుత్వం తిలోకాలు ఇచ్చిందని వారు ఇచ్చిన మాట ప్రకారం ఒకే సమయములో రైతుబంధు, ఋణ మాఫీ,రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.దివ్యాంగులకు నెలకు రెండు వేల చొప్పున,నిరుద్యోగులకు 4వేల చొప్పున,భూమి లేని కౌలు రైతులకు 15 వేల చొప్పున 6240/-కోట్లు ఇవ్వాలని, వరిధాన్యంపై 6500/- కోట్ల బోనస్ అన్ని ఏగ్గొట్టి కేవలం 6వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నందిమల్ల.అశోక్, నాగన్న యాదవ్,సింగిల్ విండో ప్రెసిడెంట్ వాసుదేవా రెడ్డి, గంధం.పరంజ్యోతి, స్టార్.రహీమ్,యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో ఉన్న బెల్ట్ షాపులు ఎత్తివేయాలి

- మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆవుల కవిత

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**



వనపర్తి బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య అతిథులుగా వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షుడు నారాయణ, వనపర్తి బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో జీ. అవుల కవిత యాదవ్ బస్వరాజ్ యాదవ్ ని భారతీయ జనతా పార్టీ వనపర్తి టౌన్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలుగా జిల్లా అధ్యక్షురాలు మహిళ అశ్విని రాధ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియమించటాన్ని సంతోషిస్తునము. బిజెపి పార్టీ యొక్క సిద్ధాంతాలకు, నియమ నిబ్బందనలకు అనుగుణంగా కట్టుబడి. ఏలాంటి తారతమ్యా భేదాలు చూపకుండ, పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా వెళ్ళకుండా పార్టీ యొక్క అభివృద్ధి కొరకై పని చేసి భారతీయ జనతా పార్టీ వనపర్తి టౌన్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నియమిస్తున్నాను. మహిళా అధ్యక్షురాలు వనపర్తి పట్టణ ఆవుల కవిత మాట్లాడుతూ దేశంలో మహిళల మీద జరుగుతున్న అరాచకాలను అడ్డుకుంటామని వార్డు వార్డులో గల్లి గల్లి లో బెల్ట్ షాపులు కచ్చితంగా ఎత్తివేయాలని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని తెలిపినారు. వనపర్తి మహిళలకు విద్యార్థులకు ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తారని హామీ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గారంటీలో మహిళ పథకం కింద 500 రూపాయలకు సిలిండర్ ఇస్తా అని ఇంతవరకు నెరవేర్చలేదు. ఖచ్చితంగా రాబోయే కాలంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలివేలమ్మ, ఏ సీతారాములు, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మా, మాజీ జిల్లా అధ్యక్షురాలు వారణాస కల్పన, లక్ష్మి, కవిత, సరోజ, అర్చన, పుష్ప, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, రాయలసాగర్, పీఎం రాము, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం జరిగింది.

## రైతులకు వెంటనే పెట్టుబడి సహాయంగా రూ.20 వేలు ఇవ్వాలి

- ప్రభుత్వానికి రైతు సంఘం విన్నపం..

**టీ మీడియా, జూలై 19, మహానంది:**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు రైతులకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా, తక్షణమే పెట్టుబడి సహాయం కోసం ప్రతి రైతుకు రూ. 20 వేలు వెంటనే అకౌంట్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా సహా కార్యదర్శి టి .రామచంద్రుడు పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామ సచివాలయ 2లో అధికారులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహా కార్యదర్శి టి .రామచంద్రుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయం అధికారుల ద్వారా, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటూ రైతులు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. వ్యవసాయ సీజన్ ముమ్మరంగా ప్రారంభమైనందువల్ల, రైతులు తమ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారస్తులును ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతుందని,2023 ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో కరువు, తుఫాన్ వల్ల దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు, ప్రత్యేకించి అరటి పండ్ల తోటలు పెట్టినష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగేతెలంగాణ ప్రభుత్వం మాదిరి మన రాష్ట్రంలో కూడా రైతులు, కౌలు రైతులందరికీ రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని, కేరళ రాష్ట్రం తరహాలో రుణ విమోచన చట్టాన్ని తెచ్చి అప్పుల ఊబిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులను ఇచ్చి, వారికి కూడా రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తింపచేయాలని తద్వారా రైతాంగ అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడాలని కోరారు. ఉపాధి కూలీల పని దినాలు 200 రోజులకు పెంచాలని, కూలి 600 రూపాయలు ఇవ్వాలని, మన జిల్లాలో నాలుగు వారాల కూలీల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, ఉపాధి కూలీల బిల్లులు తక్షణం విడుదల చేయాలని కోరారు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జీవో నంబర్ 22ను రద్దు చేసి రైతులందరికీ ఉచిత విద్యుత్తును అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల పల్లె గ్రామ రైతు సంఘం నాయకులు హిమామ్ హుస్సేన్, రాజా నాయక్, బాల మద్దిలేటి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోకండి

- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**



కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల మంజూరి కోసం దళారులను నమ్మి మోసపోకూడదని ఎక్కడ ఎలాంటి పైరవీ లేకుండా నేరుగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని వనపర్తి ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన శుక్రవారం వనపర్తి పట్టణం, వనపర్తి మండలంలోని. షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు.వనపర్తి పట్టణానికి సంబంధించి 119 సీఎంఆర్ఎఫ్,వనపర్తి మండలానికి సంబంధించి 69 సీఎంఆర్ఎఫ్ వనపర్తికి 38 కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుములా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవినీతి రహిత పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు.గత పాలకుల లాగా షాది ముబారక్ కళ్యాణ్ లక్ష్మి చెక్కుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఇంటి వద్దకే చెక్కులను తీసుకు వచ్చి అందజేస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్ పుట్టపాకల మహేష్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాసులు పట్టణ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి,విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం

**టీ మీడియా, జూలై 19 ,ఎండపల్లి:**



మండలం గుల్లకోట గ్రామం,రైతులకు మొదటి విడతగా సిఎం లక్ష రూపాయలు రుణ మాఫి చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బిసగోని సత్యం గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,ధర్మపురి శాసనసభ్యులు విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు పంట పొలా లల్లో నాటు వేస్తున్న మహిళా రైతుల మధ్య పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి కి విప్ లక్ష్మణ్ కుమార్ లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు దేవా మైపాల్ రెడ్డి,భూసారపు భూమయ్య,గోనె సురేష్,బిసగోని అంజయ్య,బిసగోని తిరుపతి, రాజు,గోనె తిరుపతి,గోనె వెంకటేష్, పున్నం లక్ష్మణ్,గొల్లపల్లి శంకరయ్య,జంగిలి లక్ష్మణ్,గుండు మహేష్, నాయకులు రైతులు పాల్గొన్నారు.



## కార్మికులతో కలిసి బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే

**టీ మీడియా,జులై19, గోదావరిఖని ప్రతినిధి:**

ఆర్జి 2 పరిధి ఓ సి పి త్రీ కృషి భవన్ కార్మికులు ఆషాడం మాసం సందర్భంగా శుక్రవారం బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ హాజరైనారు. ఎమ్మెల్యే బోనం ఎత్తుకొని కార్మికులతో వాటర్ ట్యాంక్ తెలంగాణ చౌరస్తా నుండి ఓసిపి 3 ఖుషి భవన్ అమ్మవారి మందిరం కు తీసుకువచ్చారు. అనంతరం శాసనసభ్యులు డప్పు కొట్టి కార్మికులతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృప ఆశీస్సులు రామగుండం ప్రజలు, కార్మికులపై ఎల్లవేళలా ఉండాలని మొక్కుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్, ఇతర అధికారులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి

- 170 కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటు
- ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా 500 మందికి ఉపాధి కల్పన..
- సాగు నీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్ సర్వే
- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన చేసిన మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల , పొన్నం



**టీ మీడియా ,జూన్ 19,పెద్దపల్లి బ్యూరో/ ఓదెల :**
ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పెద్దపల్లి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణా రావు, రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పాల్గొన్నారు. ఓదెల మండలం కొలనూరు గ్రామం చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 13 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పెద్దపల్లి నుంచి ఓదెల వయా కొత్తపల్లి, కొలనూరు వరకు వెళ్ళే రోడ్డును, కోటి 56 లక్షల వ్యయంతో నిర్మించిన కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామానికి చేరుకున్న మంత్రులు, అక్కడ తిరుమల ఆయిల్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారిచే 170 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోతున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి మంత్రుల బృందం శంకుస్థాపన చేసి అనంతరం కాల్వ శ్రీరాంపూర్ రెడ్డి గార్డెన్స్ లో ఆయిల్ పామ్ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను మంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళారు. ఆయిల్ పామ్ సాగు అంతర్ పంటల సాగు, వాటితో వచ్చే ఆదాయం వంటి పలు అంశాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రైతు గత సంవత్సరం నుంచి 8 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నామని, సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర రైతాంగం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. నీటి పారుదల, విద్యుత్ రంగం, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. రైతులకు రుణ మాఫీ చేయాలనే సంకల్పంతో రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి లక్ష రూపాయల వరకు రుణం ఉన్న రైతుల ఖాతాలలో మాఫీ సొమ్ము జమ చేశామని అన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ఇప్పటి వరకు 2500 ఎకరాల వరకు మాత్రమే జరిగిందని , ప్రస్తుత సంవత్సరం ఆయిల్ పామ్ విస్తీర్ణం 10 వేల ఎకరాలకు పెరగాలని, ఆసక్తి గల రైతులందరిని ఆయిల్ పామ్ దిశగా మళ్ళించాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట మొదటి మూడు సంవత్సరాలు అంతర్ పంటల ద్వారా ఆదాయం వస్తుందని, రైతులు పొద్దు తిరుగుడు అంతర్ పంట క్రింద వేస్తే ఇదే కంపెనీ మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారుల సూచనలు రైతులు పాటించాలని అన్నారు. మనకు అందుబాటులో ఉన్న భూమి లోనే ఎక్కువ పంటలు పండించాలని, రైతులు పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. మనకు అవసరమైన అన్ని రకాల నేలలు వాతావరణం, వనరులు అందుబాటులో ఉన్నాయని వీటిని వినియోగించుకొవాలని అన్నారు. మన దేశానికి ఆయిల్ పామ్ 100 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉందని, కానీ మన దగ్గర ప్రస్తుతం కేవలం 3 లక్షల 96 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే పండుతుందని, మిగిలినవి ఇండోనేషియా, మలేషియా వంటి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా పామ్ ఆయిల్ పండిస్తున్నది తెలుగు రాష్ట్రాలు మాత్రమేనని, ప్రతి ఎకరానికి మూడు , నాలుగు సంవత్సరాల సమయానికి పామ్ ఆయిల్ రైతుకు 51 వేల వరకు సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలకు, మందులకు, డ్రిప్ ఏర్పాటుకు సైతం సబ్సిడీ అందజేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు వినియోగించుకుని ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని మంత్రి సూచించారు. తుఫాన్, కరువు వల్ల పామ్ ఆయిల్ పంటకు ఇబ్బంది లేదని, ఈ పంటకు కోతుల బెడద ఉండదని, అధికంగా కూలీలు అవసరం లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులు విస్తృతంగా పర్యటిస్తూ పామ్ ఆయిల్ పంట సాగు అధికంగా జరిగేలా చూడాలని మంత్రి కోరారు. భూమి ఉన్న ప్రజా ప్రతినిధులు అంతా తప్పనిసరిగా పామాయిల్ పంట సాగు చేయాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్క రైతు అవకాశం ఉన్న మేర ఆయిల్ పామ్ పంట సాగు జరిగేలా చూడాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు ఎకరానికి ఖర్చులు పోగా లక్ష వరకు ఆదాయం వస్తుందని, దీనికి కోతుల బెడద ఉండదని, రైతుల వద్ద నుంచి ఆయిల్ పామ్ కొనుగోలు చేసేందుకు తిరుమల ఆయిల్ కెమికల్స్ కంపెనీ ద్వారా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం మనకు అవసరం ఉన్న తినే ఆయిల్ ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దీనిని తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తరించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ పనిచేస్తుందని , మన పెద్దపల్లి జిల్లాలో సైతం 45 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంటల సాగు జరగాలని అన్నారు. మహాలక్ష్మి పథకం క్రింద మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయడం ద్వారా ఆర్టీసీ సంస్థ బలోపేతం అవుతుందని, స్థానిక శాసన సభ్యుల డిమాండ్ మేరకు పెద్దపల్లిలో నూతన బస్సు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న లిరాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు వల్ల రైతు ఆదాయ వనరులు పెరుగుతాయని అన్నారు. రైతులు పండించిన పామ్ ఆయిల్ కొనుగోలు చేసి ఆయిల్ తయారు చేసేందుకు వీలుగా 24 ఎకరాల స్థలంలో 170 కోట్ల పెట్టుబడితో పా ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందని, దీని ద్వారా నేరుగా 200 మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా, 500 మంది యువతకు పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అన్నారు టెయిల్ ఎండ్ ప్రాంతాలకు శాశ్వతంగా సాగునీటి కష్టాలు తీర్చేందుకు పత్తి పాక రిజర్వాయర్ ఏర్పాటుకు సర్వే పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని అన్నారు. రైతు ఎఎస్సారెస్పీ డి83, డీ86 చివరి ఆయకట్టు సాగు నీరు సమస్య పరిష్కారం కోసం పత్తిపాక రిజర్వాయర్ నిర్మించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారిని కోరగా వారు సానుకూలంగా స్పందించి బస్సు డిపో ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది..పొన్నం ప్రభాకర్ గారికి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపడం జరిగింది...ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు టి.భాను ప్రసాద్ రావు, హరికర వేణుగోపాల్ గారు,రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, అదనపు కలెక్టర్ లు జే .అరుణ శ్రీ , జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, డిసిపి ఎం.చేతన , రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, ,పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ సీఈఓ కేశవ్ కళ్యాణ్ కర్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## అధికారులు, ప్రజాప్రతినిధులు పారదర్శకంగా వ్యవహరించాలి

- అవినీతికి పాల్పడితే సహించేది లేదు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**టీ మీడియా, జులై 19, వీపనగండ్ల :**
కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో అవినీతికి అస్కారం లేదని, అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. వీపనగండ్ల మండలంలో వివిధ అంశాలపై అధికారులతో మంత్రి విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళా సమాఖ్య, రైతులు, స్థానిక ప్రజల సమస్యలపై మంత్రి జూపల్లి గారు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో గాడి తప్పిన వ్యవస్థను బాగు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అవినీతికి తావు లేదనే సందేశం పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు వెళ్లాలన్నారు. ఎట్టి పరిస్థితిల్లో అవినీతిని సహించేదిలేదని పునరుద్ఘాటించారు. లంచాలు అడిగితే తన దృష్టికి తేవాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు..బీమా, జూరాల నీటి పారుదల ప్రాజెక్ట్ ల ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మోటార్లకు కనెక్షన్లు ఇవ్వడంలో, ట్రాన్స్ఫార్మర్ల ను ఏర్పాటు చేయడంలో జాప్యం చేయరాదని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు.

## పోయిన మొబైల్ ఫోన్ ను అప్పగించిన ఎస్సై

**టీ మీడియా ,జూన్ 19,వెల్గటూర్,**




:కిషన్ రావుపేట గ్రామానికి చెందిన పులి ఎల్లయ్య తండ్రి వెంకయ్య,తన మొబైల్ ఫోన్ ఎక్కడో పోయిందని జూన్ 4వ తేదీన పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా వెంటనే పోలీస్ సిబ్బంది స్పందించి సి ఈ ఐ ఆర్ అప్లికేషన్ ద్వారా అతని ఫోన్ కనుక్కొని ఫోన్ బాధితునికి మొబైల్ ఫోన్ ను వెల్గటూర్ ఎస్సై ఉ వ ం ఎ ా ౧ ౦ అందజేశారు. ఈసందర్భంగా ఎల్లయ్య తన మొబైల్ దొరికినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్సై కి పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎస్సై మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే తమకు ఫిర్యాదు చేసినట్లయితే సిఇఐఆర్ ద్వారా నమోదు చేసి వెంటనే మొబైల్ ను ట్రాక్ చేస్తామని ఈ విధంగా పోయిన మొబైల్ తిరిగి పొందవచ్చని తెలిపారు.



## కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా బీజేపి శాఖ ఆధ్వర్యంలో 26 వార్డ్ టీచర్స్ కాలనీ నాయకులు విజయ్ కుమార్ అధ్యక్షతన కాలనీ సమస్యల పై వనపర్తి కి మున్సిపల్ కమిషనర్ కి సిసి రోడ్ల మరమ్మత్తుల గురించి, వీధి కుక్కల స్వైర విహారం గురించి. గతంలో కాలనీలో వేసిన సిసి రోడ్లు అక్కడక్కడ గుంతలు పడి పూర్తిగా పాడైపోయాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఏర్పడి వేకిల్స్ పాడైపోతున్నాయి. 2 వారాల్లో సిసి రోడ్ల మరమ్మత్తులను పూర్తి చేయని ఎడల కాలనీవాసులే చందాలు వేసుకొని పూర్తి చేసుకుంటామని కాలనీవాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఓబీసీ రాష్ట్ర నాయకులు బీ. శ్రీశైలం , 28 వ వార్డు కౌన్సిలర్ గోపాల్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి రాయన్న సాగర్, కిసాన్ మోర్చా నాయకులు జ్ఞానేశ్వర్, బిజెపి సీనియర్ నాయకులు మురళీధర్ చారి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## రైతు బంధు నిధులు ఋణ మాఫీకి మళ్లింపు

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



**టీ మీడియా, జులై 19, వనపర్తి బ్యూరో :**
ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి రైతు భరోస ఎగ్గొట్టి కొంతమంది రైతులకు 6000/- వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేయడం రైతులను మోసం చేయడమే అవుతుందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 2లక్షల ఋణ మాఫీపై రైతాంగాన్ని మభ్యపెడుతుందని అన్నారు. 6వేల కోట్లతో ఋణ మాఫీ అవుతుందా అని ప్రశ్నించారు. యాసంగి రైతుబంధులోనే రైతులకు 2వేల కోట్లు ఎగ్గొట్టి వానాకాలం రైతుబంధు గురించి పట్టించుకోవడం లేదని అన్నారు.రైతులకు ఎకరాకు 7500చొప్పున 10వేల కోట్లు ఎగ్గొట్టారని అన్నారు. కోటి 73లక్షల మహిళలకు 2500చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడింది. కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబంధుకు కూడా ఈ ప్రభుత్వం తీలోకాలు ఇచ్చిందని వారు ఇచ్చిన మాట ప్రకారం ఒకే సమయములో రైతుబంధు, ఋణ మాఫీ,రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు నెలకు రెండు వేల చొప్పున, నిరుద్యోగులకు 4వేల చొప్పున, భూమి లేని కౌలు రైతులకు 15 వేల చొప్పున 6240కోట్లు ఇవ్వాలని, వరిధాన్యంపై 6500 కోట్ల బోనస్ అన్ని ఏగ్గొట్టి కేవలం 6వేల కోట్లతో ఒక లక్ష ఋణ మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు అని అన్నారు.

## చినుకు పడితే చిత్తడే...!

- మౌలిక వసతులు కల్పించాలి



**టీ మీడియా, జూలై 19, మహానంది:**
మహానంది మండలం అబ్బిపురం గ్రామంలోని చెంచుగుడెంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గుడిసెలలో వర్షపు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సామేలు మాట్లాడుతూ.. వర్షం కురిసినప్పుడు ఆ నీరు ముందుకు సాగే విధంగా, సైడు కాలువలు లేకపోవడంతో బురదమయంగా మారి గిరిజనలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఆ కాలనీలో సుమారుగా 35 కుటుంబాలు నివసిస్తున్నారని, వారికి కనీసం త్రాగునీరు, కరెంటు, రోడ్లు, ఉండేందుకు గృహాలు లేక చాలా పర్యాయాలు ఈ విషయం గూర్చి కలెక్టర్ను కూడా కలవడం జరిగిందని తెలిపారు. అధికారులు, నాయకులు అందరూ అర్జీలు తీసుకునే వారే తప్ప మాకు న్యాయం చేయట్లేదు అని గిరిజనులు వాపోతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మారింది. పాలన మారుతుందేమో అని ప్రజలు వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, చెంచు కాలనీ సందర్శించి, మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

## కలిసి పని చేద్దాం శాంతి భద్రతలను కాపాడుదాం

- జిల్లా ఎస్పీ గిరిధర్ ని కలిసి సన్మానించిన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**టీ మీడియా, జులై 19,వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా ఎస్పీ గా మీరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నేను సమన్వయంతో కలిసి పని చేస్తూ శాంతి భద్రతలను కాపాడదామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా నూతన ఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్పి గిరిధర్ తో ఆయన శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో "లా అండ్ ఆర్డర్" పరంగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎల్లవేళలా తమ సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘనపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగల్ విండో అధ్యక్షుడు సాయిచరణ్ రెడ్డి లు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి.....

## ఉప ముఖ్యమంత్రి భట్టితో అభ్యర్థుల చర్చలు సఫలం
## గ్రూప్ 3 పరీక్షలకు కొత్త తేది



**టీ మీడియా, జులై 19, హైదరాబాద్:**
ముందుగా షెడ్యూల్ ప్రకటించిన గ్రూప్ 2, 3 పరీక్షలు వాయిదా పడ్డాయి.. ఈ మేరకు నిరుద్యోగులు ఉప ముఖ్యమంత్రి భట్టితో జరిపిన చర్చలు ఫలించాయి.. పరీక్షలు వాయిదాకు ప్రభుత్వం అంగీకరించింది. కాగా డీఎస్సీ, గ్రూప్ 2 , పరీక్షల మధ్య వారం రోజుల మాత్రమే వ్యవధి ఉండటంతో వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో నేడు సచివాలయంలో అభ్యర్థులు చర్చించారు. అభ్యర్థులతో చర్చల అనంతరం భట్టి .టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్ చేశారు. డిసెంబరులో గ్రూప్-2 పరీక్షల నిర్వహణ అంశాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో ఓవర్ ల్యాపింగ్ లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని మహేందర్ రెడ్డి చెప్పారు. అలాగే గ్రూప్ 3 పరీక్షలకు కొత్త తేదిన ప్రకటిస్తామని చెప్పారు.ఇది ఇలా ఉండగా, . రాష్ట్రంలో మొత్తం 783 గ్రూప్- 2 పోస్టుల భర్తీకి ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాలని మార్చి నెలలో కమిషన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. గ్రూప్ -2 ఉద్యోగాలకు 5.51లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షకు వారం రోజులు ముందు డిఎస్సీ పరీక్షలు ఉండటంతో వాయిదాకు అభ్యర్థులు ఉప ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.. ఆయన సానుకూలంగా స్పందించి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు..

### నిరుద్యోగులకు మరో శుభవార్త ..

నిరుద్యోగులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో తీపి కబురు చెప్పారు. ప్రభుత్వం నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలోనే ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఆన్ లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. కోచింగ్ ఇచ్చేందుకు విషయ నిపుణులను తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా ఆన్ లైన్‌లో పాఠాలు బోధిస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులకు వచ్చే సందేహాలను ఆయా కేంద్రాల్లోనే డౌట్స్ క్లియర్ చేస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.ఇక అభ్యర్థులతో జరిగిన చర్చలలో ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్ కూడా పాల్గొన్నారు.



## మాటిచ్చాం నిలబెట్టుకుంటాం, ఎమ్మెల్యే , మంత్రులు

**టీ మీడియా, జులై 19 ,ఓదెల :**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన, ఎమ్మెల్యేలు మంత్రులు, అనంతరం మాట్లాడుతూ,ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పెద్దపల్లి జిల్లా,ఓదెల, మండలం లో,పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణా రావు, రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పాల్గొన్నారు,ఓదెల మండలం కొలనూరు గ్రామం చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఘనంగా స్వాగతం పలికారు, అనంతరం 13 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పెద్దపల్లి నుంచి ఓదెల వయా కొత్తపల్లి, కొలనూరు వరకు వెళ్ళే రోడ్డును, కోటి 56 లక్షల వ్యయంతో నిర్మించిన కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రులు ప్రారంభించారు,రైతులకు రుణ మాఫీ చేయాలనే సంకల్పంతో రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి లక్ష రూపాయల వరకు రుణం ఉన్న రైతుల ఖాతాలలో మాఫీ సొమ్ము జమ చేశామని అన్నారు.



## ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా చూడండి
## వరదలపై చంద్రబాబు సమీక్ష

**టీ మీడియా, జులై 19, అమరావతి :**
భారీ వర్షాలు, వరదలపై ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వమించారు.. 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపిన ఆయన.. ఆయా జిల్లాలలో తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.. ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు.. 185 ఎంఎంకు గాను 244 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది.. రాష్ట్ర వ్యాప్తంగా 31 శాతం అదనంగా వర్షపాతం నమోదు అయ్యిందని ఈ సందర్భంగా వెల్లడించారు.. చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.అయితే, రాష్ట్రంలో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలు కూడా ఉన్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు అధికారులు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల వల్ల గోదావరి కట్టలు బలహీన పడి ఉంటాయని.. వీటిపై దృష్టిపెట్టాలని సూచించారు సీఎం చంద్రబాబు.. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేసిన ఇయన.. ఫ్లడ్ మాన్యువల్ ను అధికారులు పాటించాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడే సమర్థత బయట పడుతుంది. అధికారులు పూర్తి అప్రమత్తంగా, డైనమిక్ గా పని చేయాలని ఆదేశించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, రాష్ట్రంలో భారీ వర్షాలతో పలు జిల్లాలు అతలాకుతలం అవుతోన్న విషయం విదితమే.. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు, వరదలతో.. పలు గ్రామాలు రాకపోకలు నిలిచిపోయాయి.

డిజిటల్ మీడియాలో అగ్రగ్రామిగా ఉన్న స్పాట్ న్యూస్ స్పీడ్‌గా అందించే టీ-మీడియాలో పనిచేయడానికి , జిల్లా, నియోజక వర్గ, మండల ఇంచార్జీలు , విలేకరులు కావలెను.
విలేకరులు కావలెను.
Regd. No. 100/20
T MEDIA
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత
కొత్తవారికి అవకాశం ఉంటుంది.
ఆసక్తి కలవారు తమ వివరాలను క్రింది నెంబర్లకు పంపండి
8500515365, 7382990365, 8919710365